

- మూడు జిల్లాలు, ఏజెన్సీ రాకపోకలకూ అనుకూలం
- ప్రజాప్రతినిధులకూ సౌలభ్యం
- పిల్లలకు దగ్గరలోనే ఐటీ ఉద్యోగాలు
- వైసీపీ హయాంలో ధ్వంసం
- కూటమి రాకతో పునరుజ్జీవం
- నూతనోత్తేజంతో రాజధాని పనుల పునః నిర్మాణం శుభారంభం
- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి భారీగా తరలివెళ్లిన జనం

గోదావరి టు అమరావతి!

ప్రధానితో..



అమరావతి సభకు వస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు







(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విజన్ ఉన్న నాయకుడి అభివృద్ధి.. విధ్వంస నాయకుడి ధ్వంసం మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలు గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా అనుభవించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రజలకు రాజధాని లేకుండాపోయింది. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని పదేపదే చెప్పడమే కాకుండా ఆచరణలో కూడా చేసి చూపించే సీఎం చంద్రబాబు.. రాజధానిని చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్మించాలని సంకల్పించారు. అన్ని పార్టీల అంగీకారంతో గుంటూరు- విజయవాడ ప్రాంతంలో నిర్మించాలనుకున్న రాజధానికి 'అమరావతి' అని నామకరణం చేశారు. 2017 మార్చి 2న శాసనసభను ప్రారంభించడంతో పాలన కూడా మొదలైంది. తర్వాత 2019లో ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా టీడీపీ అధికారం కొనసాగేవిధంగా ప్రజలు దీవించి ఉంటే ఈనాటికి అద్భుతమైన రాజధాని అమరావతి ఆవిష్కృతమయ్యేది. కానీ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. ప్రజలు జగన్‌కి పట్టంగట్టడంతో రాజకీయ కక్షను రాష్ట్ర ప్రయోజనాలకు ముడిపెట్టి అమరావతిని ధ్వంసం చేశారు. అప్పటివరకూ జరిగిన అమరావతి నిర్మాణాలను నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులంటూ ఐదేళ్లు మూడు ముక్కలాటగా నడిచింది. అయితే 2024లో మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో ఏర్పడిన కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం పగ్గాలు చేపట్టడంతో అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ప్రధాని మోదీతో రాజధాని పనులకు శుక్రవారం పునఃప్రారంభం చేయించారు. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి వాసులకు అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అమరావతి రాజధానికి వెళ్లాలంటే సగానికి సగం వ్యయ ప్రయాసలు తగ్గినట్టే.

● అందిపుచ్చుకున్నట్టేగా..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలతోపాటు రంపచోడవరం ఏజెన్సీవాసులకు కూడా అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. వివిధ పనులపై రాజధానికి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది తప్పుతుంది. హైదరాబాద్‌తో పోలిస్తే అమరావతి ఉమ్మడి తూర్పు వాళ్లకు దగ్గరే కాకుండా రవాణా సదుపాయమూ సౌలభ్యంగా ఉంటుంది. రైలు, బస్సుల్లో మూడు గంటల్లో, విమానంలో 45 నిమిషాల్లో అమరావతికి చేరుకోవచ్చు. కోర్టు, వైద్య పనులపై వెళ్లేవారికి ఇంకా సదుపాయంగా ఉంటుంది. రాత్రి వేళల్లో బస చేసే అవసరం ఉండదు. ఉదయం బయలుదేరితే పనులు చక్కబెట్టుకొని రాత్రి వేళకు ఇంటికి చేరుకోవచ్చు. గోదారోళ్ల రైలు ప్రయాణాలకు రాజమండ్రిని గేట్‌వేలాంటిది. ఈ రైల్వే స్టేషను గుండా విజయవాడ వెళ్లడానికి రోజూ 50కిపైగా రైళ్లు నడుస్తుంటాయి. అరగంటకో బస్సు అందుబాటులో ఉంటుంది. కాకినాడ జిల్లా వాళ్లకూ విజయవాడకు రవాణా సదుపాయాలు బాగానే ఉన్నాయి. కోనసీమ జిల్లావాసులకు రావులపాలెం నుంచి కూడా ప్రయాణ సదుపాయం మరింతగా కలుస్తుంది. అమలాపురం నుంచి మచిలీపట్నం హైవే గుండా కూడా విజయవాడకు సుమారు నాలుగు గంటల్లోపే చేరుకోవచ్చు.

● వైసీపీ హయాంలో ధ్వంస రచన

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతికి ధ్వంసరచన మొదలైంది. తాత్కాలిక హైకోర్టు మినహా పరిపాలన వంటి తాత్కాలిక భవనాలు తుది దశలో ఉండగా, రహదారులు వేగంగా నిర్మాణం జరుగుతూ.. ఐటీ కంపెనీలు కుదురుకునే దశలో సీఎంగా పగ్గాలు చేపట్టిన జగన్ అమరావతిని నట్టేట ముంచేశారు. జీఎన్‌ఆర్ కమిటీ సిఫారసులంటూ రాజధాని వికేంద్రీకరణను తెరపైకి తీసుకొచ్చారు. ఐదేళ్లపాటు మూడు ముక్కలాటను రాష్ట్ర ప్రజలకు చూపించారు. మూడు రాజధానులు కార్యరూపం దాలిస్తే ఉమ్మడి తూర్పు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారే. ఉదాహరణకు రాజమండ్రి నుంచి కర్నూలు 500 కిలోమీటర్లు, విశాఖపట్నం 200 కిలోమీటర్లు, విజయవాడ 200కిలోమీటర్ల దూరంలో త్రికోణాకారంలో ఉన్నాయి. విజయవాడకు ఉన్న సదుపాయాలు వేటికీ లేవు. దీంతో అష్టకష్టాలు పడాల్సి వచ్చేది.



అమరావతిలో ప్రధాని సభా ప్రాంగణంలో ఎంపీ హరీష్‌మాధుర్ , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

● పిల్లలకు దగ్గరలోనే ఉద్యోగాలు

ఓ పదేళ్ల నుంచీ సాఫ్ట్‌వేర్ చదువులపైనే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. కానీ తగిన అవకాశాలు మాత్రం దగ్గరలో లేవు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ కొలువులు కూడా దూరమయ్యాయి. మన దగ్గర చెప్పుకోదగిన కంపెనీలు లేవు. దీంతో 2019కి ముందు టీడీపీ అధికారంలో ఉండగా మొదలుపెట్టిన అమరావతి రాజధానిలో ఐటీ కంపెనీలకూ పెద్దపీట వేశారు. మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్ వంటి పెద్ద సంస్థల ఏర్పాటుకు చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని అటు విశాఖ, ఇటు అమరావతిలోను భారీ రాయితీలిచ్చారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిలోని నిర్మాణంలో ఉన్న ఐటీ కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయి. దీంతో ఐటీ కొలువుల కోసం యువత బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకే వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బెంగ తీరనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో మళ్లీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చేవిధంగా సీఎం చంద్రబాబు ఇప్పటికే కసరత్తు చేశారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలతోపాటు మధ్య, చిన్నతరహా ఐటీ కంపెనీలు పెద్దఎత్తున రానున్న కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. మన ఐటీ పిల్లలకు స్వల్ప దూరంలోనే ఉద్యోగ అవకాశాలూ లభించనున్నాయి.

● ప్రజాప్రతినిధులకూ అందుబాటులో..

ఉమ్మడి తూర్పుగోదావరిలో 23 నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్ రాజధానిగా ఉండే సమయంలో ఒక్కరోజు పనిపై అక్కడికి వెళ్లాల్సి వచ్చినా ప్రయాణకాలంతో కలిపి రెండు రోజుల సమయం పట్టేది. నియోజకవర్గంలో ఆకస్మాత్తుగా ఏదైనా ఘటన జరిగినా హాజరు కావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతానికి రావాలంటే కారులో సుమారు పది గంటలు పడుతుంది. రైలులో అయితే రాత్రి రైలెక్కితే ఉదయం హైదరాబాద్ చేరుకుంటారు. ఇప్పుడు ఉమ్మడి తూర్పునకు రాష్ట్ర రాజధాని 500 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల చేరువకు వచ్చేసింది. దీంతో ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు సైతం ముందు రోజు కాకుండా అదేరోజున ఉదయం బయలుదేరి వెళ్లి సాయంత్రానికి మళ్లీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే వెసులుబాటు కలిగింది. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సీఎం కార్యాలయం, రాష్ట్ర సచివాలయం, రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల కార్యాలయాల్లో పనులున్నా ఇలా బయలుదేరివెళ్లి.. అలా రాత్రికి వచ్చేయవచ్చు. దీంతో శ్రమ తగ్గడంతోపాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండే సమయం గణనీయంగా అదా అవుతోంది. అదే జగన్ చెప్పినట్లు మూడు రాజధానులైతే.. ఒక ఎమ్మెల్యే ఇక్కడి నుంచి బయలుదేరి అసెంబ్లీ సమావేశాలకు విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి అధికారులతో పనులకు విశాఖ చేరుకొని, కోర్టు పనులుంటే కర్నూలు వెళ్లి రావాలంటే ఎంత కష్టం.

మోదీ సభకు తరలివెళ్లిన జనం



ప్రధాని సభకు రంగంపేట మండలం వడిశలేరు నుంచి వెళుతున్న కూటమి శ్రేణులు

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని మోదీ సభకు శుక్రవారం జిల్లా నుంచి భారీగా ప్రజలు తరలి వెళ్లారు. కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు స్వీయ పర్యవేక్షణలో యంత్రాంగం 70 బస్సులను, కూటమి పార్టీల నాయకులు 250 బస్సులను ఉదయం ఏడు గంటల నుంచే గ్రామాలు, మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ప్రతి బస్సుకు ఒక ఉద్యోగిని సూపర్‌వైజర్‌గా నియమించడంతోపాటు వాటర్ బాటిళ్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచారు. బస్సులోని ప్రయాణికుల ఫోన్ నెంబర్లతో సహా పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. కొన్ని బస్సులకు ఒక టీం లీడర్‌ని ఏర్పాటు చేశారు. ముందుగా రూట్‌మ్యాప్‌పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కారం చూపడానికి కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటుచేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం గన్నవరం సిద్దార్థ మెడికల్ కళాశాలలో భోజనాలు, సభా ప్రాంగణంలో అల్పాహారం ఇచ్చారు. సాయంత్రం 6 గంటలకు తిరుగు ప్రయాణాలు ప్రారంభం కాగా దారిలోని గన్నవరంలో ప్రతి ప్రయాణికుడికి భోజన ప్యాకెట్లను అందజేశారు. మహిళా ప్రయాణికుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తంగా ప్రైవేటు వాహనాలతో కలిపి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రధాని మోదీ సభకు వేలాది మంది తరలివెళ్లడంతో కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు ఆనందం వ్యక్తంచేశారు.



కలెక్టరేట్‌లో శుక్రవారం నాడు పీజీఆర్ఎస్ రీఓపెన్‌లో భాగంగా విచారణ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్‌ఎస్ రీఓపెన్‌లో 51 అర్జీలపై విచారణ చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కార మార్గంలో భాగంగా తిరిగి వచ్చిన వాటిపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి విచారణ నిర్వహించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో తన చాంబర్‌లో 51 అర్జీలపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అర్జీ పెట్టుకున్న ఫిర్యాదీదారు, అధికారి ఇద్దరి సమక్షంలో అర్జీల విషయమై విచారణ చేశామన్నారు. ఇందులో 37 అర్జీలు సహేతుకమైనవాటిగా గుర్తించామన్నారు. మరో 14 అర్జీలు వ్యక్తిగత ఒత్తిడి వ్యూహాలతో కూడినవి, తప్పుడు ఫిర్యాదులుగానూ గుర్తించామన్నారు. మండల స్థాయిలోను, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ పరిష్కారం అయ్యే అర్జీలను కేటగిరీల వారీగా నివేదిక రూపొందించినట్టు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మండలాల వారీగా రీ ఓపెన్ అయిన అర్జీల విషయంలో పరిష్కారం మార్గం కోసం సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. 20 అర్జీలను అర్జీదారులు, సంబంధిత అధికారి సమక్షంలో పరిష్కార స్థాయిపై చర్చించి పరిష్కారం అయ్యేవాటికి సంబంధించి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి అర్జీదారులైన గోపాలపురానికి చెందిన బి.సురేష్ నుంచి రెండు అర్జీలు, దేవరపల్లికి చెందిన కె.భరత్‌కుమార్, కోరుకొండకు చెందిన ఎం.శివరాం, టి.అంజలి, నిడదవోలుకు చెందిన ఎస్.దుర్గాదేవి, పెరవలికి చెందిన వో.నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం రూరల్‌కి చెందిన ఎం.సతీష్, రాజానగరానికి చెందిన సీహెచ్.సత్తిబాబు, సీతానగరానికి చెందిన సీహెచ్.సురేష్, బి.సూరిబాబు, డి.చిరంజీవి, తాళ్లపూడికి చెందిన ఆర్.సాయికృష్ణ నుంచి వివరాలు తెలుసుకుని వారి ఫిర్యాదులపై వాస్తవ పరిస్థితిని కలెక్టర్ వారికి వివరించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై పరిష్కారం చూపే విషయంలో కచ్చితత్వం చూస్తోందని తెలిపారు.

2,38,767 టన్నుల ధాన్యం సేకరణ

కోతలకు అనుగుణంగా లక్ష్యాల పెంపు : జేసీ

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 206 రైతు సేవా కేంద్రాల ద్వారా 20వేల 692 మంది రైతుల నుంచి ఈ రబీ సీజన్లో 2,38,767 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. 31,349 ఎఫ్‌టీవోలకు 22,025కు చెందిన రైతుల ఖాతాల్లో రూ.400 కోట్ల 76 లక్షలు జమ చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో నూర్పిడిని అనుసరించి కొనుగోలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే లక్ష్యాలను పూర్తి చేశామని, అయితే ఆయా మండలాల్లో కోతల ప్రకారం కొనుగోళ్ల లక్ష్యాలను కూడా పెంచడం జరుగుతుందని వెల్లడించారు.

నిడదవోలు నియోజకవర్గ రహదారులకు మోక్షం

రూ.5 కోట్ల నిధులు విడుదల

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గంలోని రహదారులు యుద్ధప్రాతిపదికన బాగుపడతాయని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రహదారుల మరమ్మతులకు తన అభ్యర్థనతో రూ.5.10 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఎర్రచెరువు-పి.వేమవరం రూ.1.26 కోట్లు, వడ్లూరు-తీపర్రు రూ.3.24 కోట్లు, తేతలి-మునిపల్లి రహదారుల మరమ్మతులకు రూ.60 లక్షలు కేటాయించారని మంత్రి చెప్పారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సీఎం మత్స్య సంపద యోజన : జేసీ

రాజమహేంద్రవరం సిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వడం కోసం ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద లబ్ధిదారులను గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో సమన్వయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద పథకానికి సంబంధించి జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, జిల్లా కమిటీలో చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మెంబర్ సెక్రటరీగా జిల్లా మత్స్యశాఖ అధికారి, మెంబర్లుగా డ్వామా, డీఆర్‌డీఏ, భూగర్భ జలాలు, లీడ్‌బ్యాంక్ జిల్లా అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మత్స్యకారుల ఆదాయం పెంచడం, మత్స్య పరిశ్రమను అభివృద్ధిచేయడం, మత్స్య ఉత్పత్తిని పెంచడం కోసం సమర్థవంతమైన పనితీరు, కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారని జేసీ తెలిపారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ ఎన్.నిర్మలాకుమారి, మత్స్యశాఖ ఏడీ షేక్ దిల్‌షాద్, గ్రౌండ్‌వాటర్ డీడీ జి.రాధాకృష్ణ, డ్వామా పీడీ ఎం. నాగమల్లేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎన్.మూర్తి తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మ్యాట్రిమోనిలో పరిచయం..
ఘరానా మోసం 7



కొవ్వూరులో గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో సేద తీరుతున్న ప్రజలు

అల్లాడి.. నదిలో ఆహ్లాద జడి..

కొవ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చి నిప్పులు కురిపిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత బాగా పెరిగింది. 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఎండకు తోడు వడగాలులు వీయడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. వేసవితాపం తాళలేక కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు గోష్పాద క్షేత్రానికి చేరుకుంటున్నారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తూ సేదతీరుతున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జలకాలాడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా సాయంత్రం అయ్యేసరికి గోష్పాదక్షేత్రానికి చేరుకోవడంతో క్షేత్రంలో సందడి నెలకొంటోంది. స్నానఘట్టాల్లో నదీ లోతు తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో దూర ప్రాంతాల యాత్రికులు, పర్యాటకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. యాత్రికుల సౌకర్యార్థం క్షేత్రంలో తగిన భద్రతతోపాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.





సువర్ణ గోదారి!

గోదావరిని ఎలా చూసినా మనోహరమే. ఒక్కోసారి ఒక్కో వర్ణంలో మెరుస్తూ మనల్ని మైమరిపిస్తుంది. శుక్రవారం సాయంసంధ్య సమయంలో మరొకమారు సమ్మోహనానికి గురిచేసింది. సాయంకాలంఅస్తమిస్తున్న తరుణంలో భానుడు బంగారు వర్ణపు కిరణాలను ప్రసరించాడు. ఆ వన్నెల కిరణాలకు గోదారీ స్వర్ణమయం అయిపోయింది. ఆ క్షణంలో ఎటుచూసినా స్వర్ణమయమే. ఇలా బంగారు వర్ణంలో గోదావరి తళతళలాడుతున్నప్పుడు అక్కడ ఇసుక తీస్తున్న యంత్రాలు గోదారిలోంచి బంగారాన్ని తీస్తున్నట్టుగా కనువిందైన దృశ్యాలను ఆవిష్కరించాయి..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

- ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు
- హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు 7

అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

- ● ఛేదించిన బిక్కవోలు పోలీసులు
- ● నలుగురు నిందితుల అరెస్టు 7
- ● రూ.41.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



భీమ కవి పాల రాతి విగ్రహం

వేములవాడలో భీమ కవి ఆలయం

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

భీమ కవి విగ్రహాన్ని ఊరేగించిన గ్రామస్తులు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో వేములవాడ భీమ కవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వరపుత్రుడిగా ప్రాశస్త్యం పొందిన భీమ కవికి గ్రామస్తులు రూ.50 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. అందులో పాల రాతి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం భీమ కవి విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఉంచి పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వేములవాడ, వలసపాకల గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజ్యం విశ్వనాథ శివాచార్య ఆధ్వర్యంలో భైరవభొట్ల మాచరి బ్రహ్మజీ శర్మ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని, అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు వివరించారు. ఊరేగింపులో కరప డీసీ ఛైర్మన్ పీజీ సత్యనారాయణ, మీసాల రాంబాబు, బండే తాతాజీ, పాలికవీ ర్రాజు, సూరిబాబు, అప్పనపల్లి శ్రీవెంకటనారయ్య, పెద్ద, వజ్రపు కామేశ్వరరావు, పుణ్యమంతుల అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేములవాడ భీమకవి జన్మస్థలంగా పేర్కొంటూ ఏర్పాటుచేసిన ముఖద్వారం



నూతనంగా నిర్మించిన భీమ కవి ఆలయం



భీమ కవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న వేములవాడ గ్రామస్తులు



భారత్-వియత్నాం మధ్య బలమైన సాంస్కృతిక బంధం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): భారత్-వియత్నాం నడుమ ఆధ్యాత్మిక సామరస్యం, బలమైన సాంస్కృతిక బంధాన్ని పెంపొందించే విధంగా వియత్నాం బౌద్ధ విశ్వవిద్యాలయంలో బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠ వైభవంగా జరిగిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి న్యూఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద దేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరిచిన బుద్ధుడి పవిత్ర అస్థికలు, అవశేషాల పేటికకు నమస్కరించి ఐఏఎఫ్‌కు చెందిన హెర్క్యులస్ అనే ప్రత్యేక విమానంలో పవిత్ర ప్రయాణం ప్రారంభించామన్నారు. వియత్నాం చేరుకుని శుక్రవారం బౌద్ధ విశ్వవిద్యాలయంలోని బుద్ధ హాలులో అంగరంగ వైభవంగా వాటిని ప్రతిష్ఠించామన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి బుద్ధుని పవిత్ర అవశేషాలను వియత్నాం తీసుకెళ్లే అవకాశం దక్కడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన వేడుక భారతీయ నాగరికత, శాంతియుత సహన వారసత్వానికి శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని మంత్రి చెప్పారు.





బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మురమళ్లలో రెండో రోజుకు బ్రహ్మోత్సవాలు

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో గవ్యాంతం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. స్వామికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం జరిపించారు. స్వామి చంద్రప్రభ వాహనంపై ఆసీనులై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

రాష్ట్ర క్రీడగా కబడ్డీ గుర్తింపునకు కృషి

● అట్టహాసంగా 12వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు ● హోరాహోరీగా సాగిన పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ షాన్‌మోహన్

సర్పవరంజంక్షన్, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను ప్రోత్సహించి వారిని రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, ప్రస్తుతం ఉన్న 2శాతం రిజర్వేషన్‌ని 3శాతానికి సీఎం చంద్రబాబు పెంచి క్రీడలపై ఉన్న ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడరూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఏపీ ఆంధ్ర 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ- 2025 చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎమ్మెల్యే పంతం నానాజీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే సముద్రతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంద న్నారు. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. గత నాలుగు నెలలుగా బీచ్‌ని అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్,పంచాయతీ సిబ్బంది విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. రాబోయే 3 నెలల్లో సుమారు రూ. 2.5కోట్లతో పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. పర్యాటకులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీరు, లైట్లు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సముద్రతీరాన్ని కలుషితం చేయకుండా అధికారులకు సహకరించాలని, బీచ్‌ని అపరిశుభ్రంచేసే వారిపై కేసుల నమోదుకు వెనుకాడబోయే ప్రశక్తేలేదన్నారు. ఎన్టీఆర్ బీచ్‌లో గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేవారని, కరోనా తదితర కారణాలతో బీచ్‌లో ఎటువంటి కార్యక్రమాలు జరగకపోవడంతో రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మే 2 నుంచి 4 వరకు ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడలద్వారా శారీరక దారుఢ్యంతో పాటూ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. కబడ్డీ క్రీడను రాష్ట్ర క్రీడగా గుర్తింపు ఇవ్వాలని, ప్రో కబడ్డీగా దేశవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. పర్యాటకులకు ఆహ్లాదన్నందించే బీచ్‌లో రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఈనెల 15-20 నుంచి మచిలీపట్నంలో జరిగే అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేస్తామని ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి తెలిపారు. బీచ్ సుందరీకరణకు కృషిచేస్తున్నామని, అతిత్వరలో ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ భావన తెలిపారు. ముందుగా రాష్ట్రం నుంచి ఇక్కడకు విచ్చేసిన 26 మహిళా పురుషుల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బెలూన్లను గాల్లోకి ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. సాయం సమయాన సుందర తీరాన ఎన్టీఆర్ బీచ్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, క్రీడా భివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కేఎస్‌పీఎల్ సీఈవో మురళీధర్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఏపీ గౌడ, ఎస్సీ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టాప్రకాశ్ గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందు, జీని శ్రీనివాస్, సోదె మునలయ్య, వీరబాబు, రాజు పాల్గొన్నారు.




కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న బీచ్ కబడ్డీ పోటీలో తలపడుతున్న తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్లు



తూర్పుగోదావరి, చిత్తూరు పురుషుల జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న కబడ్డీ పోటీ

ఒకే జీడి మామిడి పండుకు మూడు గింజలు



మూడుపిక్కల జీడిమామిడి పండు

● ఆశ్చర్యంగా తిలకిస్తున్న గ్రామస్థులు

మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం పడమటిపాలెంలో అంబటి లక్ష్మీనారాయణకు చెందిన జీడి తోటలో ఒక జీడి పండుకు మూడు గింజలు కాశాయి. సాధా రణంగా ఒక జీడిమామిడిపండుకు ఒక గింజమాత్రమే ఉంటు ంది. పడమటివారిపాలెంలో మాత్రం ఒక పండుకు మూడు గింజలు ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



కల్యాణోత్సవ ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు

సమన్వయంతో పనిచేయండి

● ఉద్యోగులు ఎవరూ సెలవులు పెట్టకండి
● కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలపై ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు ఎవరెవరువచ్చారు ఎవ రైనా గైర్హాజరయ్యారా అంటూ ప్రశ్నించారు. అనంతరం కల్యాణోత్సవాల సమయంలో ఎవరూ సెలవులు పెట్టకండి సమన్వయంతో పనిచేయండి అని సూచించారు. ప్రధానంగా స్వామివారి కల్యాణం జరిగే 8వ తేదీ, రథోత్సవం జరిగే 11న భక్తజనం అధికంగా ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అయితే సమీక్షలో పాల్గొన్న ఉద్యోగులు మాత్రం ప్రధానాంశాలు చర్చించకపోవడంతో పెదవి విరిచారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మస్థాపనకు విశేష కృషిచేసిన జగద్గురువులు ఆదిశంకరాచార్యుల జయంతి పురస్కరించుకుని శుక్రవారం సత్యదేవుడి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపఠం పల్లకీలో ఉంచి పండితులు మంత్రోచ్ఛరణలు, హరిహర శంకర, జయజయశంకర నినాదాలతో ఆలయ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈవో సుబ్బారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ

గ్రామంలో గురు దత్తాత్రేయ ఆలయంలో శంకరాచార్యులు విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉద యం గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం పంచగవ్యప్రాశన, షోడషోపచార పూజలు నిర్వహించి ఉదయం 9.37కి కళాన్యాసం గావించారు. కార్యక్రమంలో దత్త సమా ఖ్య అధ్యక్షుడు మహేంద్రవాడ జగదీష్, వారణాశి సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో:

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శంకరజయంతి పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుబ్రహ్మణేశ్వర ఆలయంలో శంకరాచార్యుల విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం విశేష అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించా రు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, సర్పంచ్ కుమార్‌రా జా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డి.వి.జె.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి కామర్స్ చిరంజీవి పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దేవస్థానం పండితులు

గొర్రిపూడి వెల్ఫేర్ అసిస్టెంట్‌పై హిజ్రాల దాడి

● గోల్డ్‌చైన్ అపహరణ
● కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కరప మండలం గొర్రిపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనుసూరి రవీంద్రపై గుర్తుతెలియని కొంతమంది హిజ్రాలు దాడిచేసి అతని మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్ర గత ఏప్రిల్ 30వ తేదీ మధ్యాహ్నం కాకినాడలోని ఒక బ్యాంక్ నుంచి పింఛను సొమ్ము డ్రా చేసి గొర్రిపూడి సచివాలయానికి బయలుదేరారు. కరప మండలం పాతర్లగడ్డ వచ్చేసరికి పలువురు హిజ్రాలు అతని బైక్‌ను చుట్టుముట్టి డబ్బులివ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. బైక్ వెనుక ముందు ఎక్కి పింఛన్ల సొమ్ము ఉన్న బ్యాగ్‌ను లాక్కోబోయారు. వారి బాధ భరించలేక రవీంద్ర పర్స్‌లో నుంచి రూ.50 తీసి ఇవ్వగా సరిపోవని మరో రూ.100 గుంజుకున్నారు. వారిని వదిలించుకుని కొంతదూరం వచ్చి చూసుకోగా మెడలోని 10గ్రాముల బంగారు గొలుసు మాయమైనట్టు గుర్తించాడు. వెనక్కు వెళ్లి చూడగా హిజ్రాలు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై బాధితుడు అదేరోజు సాయంత్రం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తోట సునీత కొంతమంది హిజ్రాల వీడియోలు, ఫొటోలను చూపించగా వారు కాదని బాధితుడు నిర్ధారించినట్టు తెలిసింది. పెనుగుదురు-పాతర్లగడ్డ, పెనుగుదురు-కరప ప్రధాన రహదారులు, వేళంగి రైల్వేట్రాక్, నడకుదురు పరిసరాల్లో రాత్రుళ్ల హిజ్రాలు చేస్తున్న ఆగడాలు భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది యువకులను హిజ్రాలు ఆకర్షించి వారి నుంచి సొమ్ములు కాజేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థాయీ సంఘాలు సూచించిన అంశాలపై.. సత్వర చర్యలు చేపట్టాలి

● జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ, మే 2(ఆంధ్రజ్యోతి): స్థాయీ సంఘాలు చర్చించిన, సూచించిన అంశాలన్నింటిపైనా జిల్లాల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సూచించారు. తూర్పుగోదావరిజిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు శుక్రవారం జడ్పీ చైర్మన్, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాల్లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలోని నాలుగు నూతన జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పురోగతిని ఆయా స్థాయీ సంఘాలు సమీక్షించి, మరింత పటిష్ఠత, సత్వర అమలుకు అధికారులకు సూచనలు చేశారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ, సీనరేజీ సర్దుబాటు చెల్లింపులు వెంటనే జరపాలని, పంచాయతీల పరిధిలో జరిగే అన్ని పనులకు తప్పనిసరిగా పంచాయతీ తీర్మానాలతోనే నిర్వహించాలని సంఘాల సభ్యులు కోరారు. ఇప్పటికే చేసిన పనులకు సత్వరం చెల్లింపులు జరపాలని కోరారు. గ్రామీణాభివృద్ధిపై చర్చలో కొత్తగా పింఛన్ల మంజూరు కోసం వేచి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఇందుకు సంబంధిత వెబ్‌సైట్‌ను తెరవాలని సభ్యులు కోరారు. మహిళ, శిశు సంక్షేమంపై చర్చలో బాలికల రక్షణ, శారీరక, మానసిక వికాసం లక్ష్యంగా జిల్లాలో శుక్రవారంనుంచి నిర్వహిస్తున్న కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను కూడా తప్పనిసరిగా భాగస్వాములు చేయాలని సభ్యులు కోరారు. సంక్షేమశాఖల చర్చలో వివిధ సంక్షేమ కార్పొరేషన్లద్వారా అమలుచేస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో జడ్పీటీసీ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వైద్యఆరోగ్యశాఖలో ఖాళీ ఉన్న వైద్యులు, పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీచేసి వైద్యసేవలకు విఘాతం లేకుండా చూడాలని సభ్యులు కోరారు. విద్య అంశంపై టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. విద్యుత్‌శాఖపై చర్చలో పీఎం సూర్యఘర్ పథకంద్వారా ఉమ్మడి జిల్లాల్లో అవకాశం ఉన్న ప్రతి కుటుంబానికి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని జడ్పీచైర్మన్ వేణుగోపాలరావు అధికారులను కోరారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

● ఛేదించిన బిక్కవోలు పోలీసులు ● నలుగురు నిందితుల అరెస్టు
● రూ.41.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

బిక్కవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ జిల్లాల దొంగల ముఠా గుట్టురట్టయ్యింది. బిక్కవోలు పోలీసులు కేసు ఛేదించి వారిని అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి రూ.41.50 లక్షల విలువ గల చోరీ సొత్తును, నగదును స్వాధీనం చేసుకున్నారని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శుక్రవారం బిక్కవోలులో ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన అనకాపల్లి జిల్లా మాకవరపు మండలానికి చెందిన దల్లి కామిరెడ్డి(తామవరం), వళ్ల శ్రీను(గిడుతూరు), కచ్చల చిరంజీవి(చినరాచపల్లి), సఖిలేటి సాయి(జంగాలపల్లి)కి చెందిన నలుగురు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు బైక్ మెకానిక్, లారీ డ్రైవర్, ఐరన్ షాపుల్లో పని చేస్తూ వచ్చిన డబ్బు జల్సాలకు సరిపోక దొంగతనాలకు అలవాటుపడ్డారు. దీంతో వీరు తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, ఏలూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఇప్పటివరకూ 25చోరీలకు పాల్పడ్డారు. ఈయేడాది జనవరి 9న ఈనలుగురు గతంలో విశాఖపట్నంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన బ్రిజా కారులో బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం వచ్చి వరుసగా వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు దొంగిలించి గ్రామంలోని ఇండియా ఏటీఎంను, స్థానిక జ్యూయలరీ షాపులో దొంగతనానికి ప్రయత్నించి విఫలమవ్వడంతో తిరిగి వెళ్లిపోయారు. ఆపై వచ్చిన సమాచారం మేరకు నలుగురు నిందితుల్లో ఒకరైన సఖిలేటి సాయిని తుని రైల్వేస్టేషన్ వద్ద కొయ్యలగూడెంలో దొంగిలించిన మోటారు బైక్‌తో బిక్కవోలు పోలీసులు పట్టుకుని విచారించి రిమాండ్‌కు పంపారు. అయితే నిందితుల్లో మరొకరైన కచ్చల చిరంజీవిని పీటీ కేసులో మాకవరపుపాలెంలో అక్కడి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో అనపర్తి సీఐ, బిక్కవోలు ఎస్‌ఐలు చాకచక్యంగా పై కేసుల్లో ప్రధాన నిందితులైన దల్లి కామిరెడ్డి, వళ్ల శ్రీనులను గురువారం సాయంత్రం తుని రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసి వారి నుంచి రూ.41.50లక్షల విలువైన సొత్తు, 71 గ్రాముల బంగారు వస్తువులు, కిలో వెండి వస్తువులు, మూడు మో టారు సైకిళ్లు, ఒక కారు, జగనన్న కాలనీ ఇంటి పత్రాలు, గ్యాస్ కట్టర్లు, రూ.9.80 లక్షల నగదు) స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్టు డీఎస్పీ భవ్యకిషోర్ వివరించారు. ఈ కేసును ఛేదించిన అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్‌ఐ రవిచంద్రకుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా వినయ్



యానాం, మే 2 (ఆంధ్రజ్యోతి): యానాంకి చెందిన ఐఆర్ఎస్ అధికారి మల్లిపూడి వినయ్ చెన్నై ఎయిర్‌పోర్టు కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2017 బ్యా చ్‌కు చెందిన వినయ్ చెన్నైలోని జీఎస్టీ ఇంటె లిజెన్స్ విభాగంలో ఆఫీసర్‌గా పని చేశారు. ప్రస్తుతం వినయ్ చెన్నై ఎయిర్ పోర్టులో కీలక బాధ్యతలు చేపట్టారు. స్మగ్లింగ్ నిరోధక చర్యలు, ప్రమాణికుల రాకపోకలు, నిషిద్ధవస్తువులు పట్టివేత, కస్టమ్ చట్టం అమలును పర్యవేక్షించడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నారు.

గంజాయి కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో 266 కేజీల గంజాయిని లారీలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడు బొద్దిక సురేష్ నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ రాజమండ్రి 1వ అదనపు సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి ఆర్.శివకుమార్ తీర్పును వెల్లడించారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో బొద్దిక సురేష్ గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు అతన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. అప్పట్లో బొమ్మూరు స్టేషన్‌లో బొద్దిక సురేష్‌పై క్రైమ్‌నెంబరు 375/2017లో సెక్షన్ 8(సి),20(బి)(2)(సి)ఆఫ్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద రెండో ముద్దాయిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో అతన్ని రిమాండ్‌పై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈకేసు పూర్వాపరాలను న్యాయమూర్తి పరిశీలించారు. ప్రాసిక్యూషన్ తరపున వీపీ లక్ష్మణ్‌నాయక్ బలమైన వాదనలు వినిపించారు. తుది తీర్పును న్యాయమూర్తి వెల్లడించారు. ఈకేసులో అప్పటి దర్యాప్తు అధికారి కే.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత సీఐ పి.కాశీవిశ్వనాధంలు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడటానికి దోహదపడ్డారు.

దొంగతనంగా జామాయిల్ తోట నరికివేత

● బూరుగువాయి తండాలో కాంట్రాక్టర్‌కు విక్రయం

ఎటపాక, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు చెందిన జామాయిల్ తోటల్లో కొందరు దొంగలు పడి అర్ధరాత్రి జామాయిల్ కర్రలు(సైజులు) నరికి తీసుకెళ్లి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఇటీవల అల్లూరిజిల్లా ఎటపాక మండలం, సీతాపురం, కుసుమనపల్లి గ్రామాల్లో ఈ జామాయిల్ పంట(కర్రల) దొంగతనాలు అధికమయ్యాయి. మూడురోజుల క్రితం సీతాపురం గ్రామానికి చెందిన వల్లభనేని విష్ణుమూర్తి జామాయిల్ తోటలోని సుమారు 6టన్నుల జామాయిల్ పంటను నరికి ఎత్తుకెళ్లారు. దొంగతనంగా తోటల్లో నరికిన పంటను బూరుగువాయి తండాలో ఓ జామాయిల్ కాంట్రాక్టర్ కొనుగోలు చేస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. ఆగ్రామంలో వేబ్రిడ్జి ఏర్పాటుచేసి, పగలు రాత్రి తేడా లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దొంగతనంగా జామాయిల్ కర్రల లోడును తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొందరు రైతులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఆ ట్రాక్టర్ కుసుమనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిగా ప్రచారం సాగుతోంది. కొందరు వ్యక్తులు ఇటీవల ముఠాగా ఏర్పడి, జామాయిల్ తోటలను నరికి, దొంగతనంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు జమాయిల్ తోటల నరికివేత దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మ్యాట్రిమోనిలో పరిచయమై దోషాల పేరుతో బంగారు వస్తువుల దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): పితృదోషం పూజలు పేరులో ఒంటరి మహిళను గుర్తుతెలియ ని వ్యక్తి మోసంచేసి బంగారం, వెండి వస్తువులతో ఉడాయించాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నెల్లూరుకి చెందిన జి.నాగభారతి అనే 30ఏళ్ల తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటుంది. రెండో వివాహం కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలో మెట్రిమోనిలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. అతను నీకు నాకు పితృదోషాలు ఉన్నాయని రాజమహేంద్రవరంవస్తే కోటిలింగాల రేవులో పూజలుచేసి పరిహారం చెల్లిస్తే దోషాలు పోతాయని చెప్పడంతో ఆ గుర్తుతెలియని వ్యక్తి మాటలు నమ్మిన భారతి గతనెల 20న రాజమహేంద్రవరం వచ్చింది. దీంతో ఆమెను రిసీవ్ చేసుకున్న సదరు గుర్తుతెలియని వ్యక్తి ఆమెను కోటిలింగాల రేవుకు తీసుకువెళ్లి పితృదోషాల పూజలు చేయించడానికి సిద్ధం చేసి ఆమెను ఒంటిమీద ఉన్న బంగారం, వెండి వస్తువులను తీసి స్నానం చేసి రమ్మని చెప్పాడు. దీంతో ఆమె వాటిని తీసి అతనికి ఇచ్చి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి వస్తువులతో సదరు వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీంతో ఆమె ఖంగుతిని గత పదిరోజులుగా రాజమహేంద్రవరంలో ఆ వ్యక్తి కోసం వెతికి చివరికి శుక్రవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తి పేరు కూడా ఆమెకు తెలియదని అతని ఫొటో వుందన తన ఫిర్యాదులో పేర్కొంది. మొత్తం 34 గ్రాముల బంగారు అభరణాలు, 26 తులాల వెండి పట్టీలు అపహరించుకుపోయాడి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కాకినాడ క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ దుకాణంలో చోరీ కేసులో పట్టుబడ్డ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మనాభనగర్ అన్నమ్మ ఘాటీ సెంటర్‌కు చెందిన వెలుగుబంటి వీరబాబు ఏప్రిల్ ఒకటో తేదీ అర్ధరాత్రి పులవర్తివారి వీధిలో గల మహీంద్రా స్వీట్‌స్టాల్‌లో చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో వాదోపవాదనలు ముగిసిన తర్వాత నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి తీర్పు నిచ్చినట్లు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు.

నేటి నుంచి వాసవీమాత జయంతోత్సవాలు



ధవళేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రామపాదాల రేవు సమీపంలో నిర్మించిన ఆలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతోత్సవాలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని పరిసరాలను విద్యుత్‌దీపాలు, పూలమాలతో అలంకరించారు. ప్రతి రోజు అమ్మవారికి కుం కుమ పూజలు నిర్వహించనున్నారు. సాయం త్రం భజన, లలిత సహస్రనామ పారాయణం, పేరంటం, ప్రసాదాల వితరణ, ఉయ్యాల సేవ జరుగుతాయి. 4న చండీహోమం, సారె సమర్పణ, 7న అమ్మవారి గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. గ్రామానికి చెంది వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులు ఈ జయంతోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానాలు అందజేశారు.

శంకరాచార్య జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): హైందవ ఆధ్యాత్మికలను చాటిన అవతారం శంకర భగవత్పాదులదని శంకరమఠం శారదాపీఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ రామ్ అన్నారు. శంకర జయంతి సందర్భంగా శుక్రవారం బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర జయంతి వేడుకలు గోదావరి గట్టున శంకర పీఠంలో జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ శంకరులు అద్వైత వేదాంతాన్ని భారత జాతికి అందించారన్నారు. దేశంలో నాలుగు మఠాలను స్థాపించారన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు దూర్వా సత్యనారాయణ, రెండు చింతల శ్రీనివాస్, లక్ష్మణరావు, ఆలయ ప్రధాన అర్చకులు తాతయ్యశాస్త్రి పాల్గొన్నారు. స్థానిక లాల్ బహదూర్ శాస్త్రి రోడ్డులోని దువ్వూరి రామకృష్ణారావు ట్రస్ట్ సభా మండపంలో జరిగిన కార్యక్రమంలో కఠోపనిషత్తుపై ప్రభల ప్రసంగించారు. నచికేతుడికి యముడు బోధించే ఆత్మస్వరూపాన్ని ఈ ఉపనిషత్తు వివరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయనను ట్రస్ట్ కార్యదర్శి కె.ప్రభాకరశాస్త్రి, జె.రామగోపాలం సత్కరించారు. పిచ్చుక రాంబాబు, కాలనాథభట్ల సత్యనారాయణమూర్తి, నల్లగొండ రవిప్రకాష్, సత్యమూర్తి, మారిశెట్టి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం కార్యవర్గ ఆత్మీయ కలయిక



కార్యక్రమంలో పాల్గొన్న శిష్టకరణ సంఘం నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, మే2(ఆంధ్రజ్యోతి): శిష్టకరణ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఆత్మీయ కలయిక స్థానిక శేషయ్య మెట్ల,రజక సేవా సంఘం కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. సభను జిల్లా అధ్యక్షుడు పొట్లూరు శివ సూర్య ప్రకాశరావు ప్రారంభించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కుమహంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ సమైక్యంగా ఉండాలని సంఘ అభివృద్ధికి అందరూ శక్తివంచన లేకుండా పాటుపడాలన్నారు. సంఘ సభ్యుల సమస్యలను తీర్చడానికి ఎప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బట్లంకి నాగప్రకాష్, ఉపాధ్యక్షులు బిల్డర్ చిన్న, ఎస్‌వీ శ్రీనివాసరావు, డబ్బీరు విజయదివాకర్, కొట్టె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటికుండీల పంపిణీ



రాజమహేంద్రవరం కల్చరల్ మే2(ఆంధ్రజ్యోతి): పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నామన వాసు, లలితా నగర్ ఫ్రెండ్స్ సర్కిల్ సహకారంతో నామన ధనరాజు జ్ఞాపకార్థం, ఈ వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు వీలుగా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు స్థానికులకు నీటికుండీలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ వేసవి తాపానికి, ప్రజలే అల్లాడిపోతున్నారని, నోరులేని మూగజీవాల దాహార్తిని తీర్చడం మానవతా ధర్మంగా మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. 2012 నుంచి ప్రతిఏటా ట్రస్టుతరపున పంపిణీ చేస్తున్నామన్నారు. ఆదిత్య వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నండూరి సుబ్బారావు, తాళం శ్రీను, వారాది అంజనేయులు, ఇసుకపల్లి శ్రీనివాస్, పెనుగొండ రామకృష్ణ, బిక్కిన రవి,పంతం శ్రీను, పడాల వెంకట్, అజంతా కిరణ్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నాగమణి

రాజానగరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 311 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం-వేసవి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి మాట్లాడారు. తొలిరోజు కార్యక్రమంలో బాలికలు ఒకరి నొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం చర్చించారన్నారు. 6న రుతుక్రమం పరిశుభ్రత, 9న బాల్య వివాహాల వల్ల కలిగి దుష్ప్రభావాలు, 13న పోక్సో చట్టం పై అవగాహన, 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 20న అసమానతలు, 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, 27న సైబర్ నేరాలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, జూన్ 3న కౌమార బాలికల నాయకత్వం, 6న ఆటల ప్రాముఖ్యత, 10న బాల్య వివాహాలు నివారణపై అవగాహన కల్పిస్తామని సీడీపీవో చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.కె.దుర్గామణి, ఎస్.భూదేవి, ఎస్.సింహాచలం, ఏఎన్ఎంలు, జీఎంఎస్‌కెలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వీవోఏలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

రోబో వినియోగం రైతుకు మేలు



ఫార్మా రోబో క్షేత్ర ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

రాజానగరం, మే 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రోబో వినియోగం వల్ల రైతు లకు ఉత్పాదకత పెరగడమే కాకుండా ఖర్చులు తగ్గుతాయని జీజీయు ఉపకులపతి యు. చంద్రశేఖర్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఫార్మా రోబో ప్రదర్శన సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగం పెరుగుతోందన్నారు. జీజీయులోని బి.టెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల పరిశోధనల ద్వారా పంట సాగులో ఉపయోగపడే అధునాతన పరికరాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఫార్మా రోబో మేనేజింగ్ డైరెక్టర్ వజ్రాల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ రోబో కలుపు తీయడం, పురుగు మందుల పిచికారి, బ్రష్ కట్టర్ వాడకం, మామిడి చెట్లకు స్ప్రే చేయడం వంటి పనులను ఆటోమేటిగ్‌గా నిర్వహిం చగలదన్నారు. వరి, అరటి, కూరగాయలు, మామిడి తదితర పంటలకు ఈ పరికరం రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్, వ్యవసాయ విభాగాధిపతి బలరాం భగత్, ఫార్మా రోబో మార్కెటింగ్ మేనేజర్ దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేయాలి

రంగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం కోసం పోరాడదామని ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం సింగంపల్లి గ్రామం సీపీ రెడ్డి నగర్ కాలనీలో ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. ముందుగా ఏపీఆర్‌సీఎస్ జెండాను సంఘం మండల నాయకులు చెక్క సత్తిబాబు ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఇప్పటికే రైతుల పంటలకు గిట్టుబాటు ధర, పెట్టుబడులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు రైతుల పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బి.యేసు, ఏపీఆర్‌సీఎస్ నాయకులు నవీన్, రాయుడు కన్నబాబు, నర్ల లక్ష్మీ, పద్మ, దంగేటి రత్నం, చిక్కాల దుర్గమ్మ, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.



సింగంపల్లిలో నినాదాలు చేస్తున్న రైతుకూలీ సంఘ నాయకులు

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం



కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వాసు

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక దర్బా వారి సత్రం, తాడితోట అంబేడ్కర్ నగర్, తుమ్మలోవ, నారాయణపురం, 47వ డివిజన్‌లలో 800 మంది మహిళలకు కుటు శిక్షణా కార్యక్రమాన్ని ఆయా కేంద్రాల్లో ఎమ్మెల్యే వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పది టైలరింగ్ కుటుమిషన్ సెంటర్లను మంజూరు చేసిందన్నారు. నగరంలో 3వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఉచిత కుట్టుశిక్షణ అందిస్తే వైసీపీ పాలనలో మిషన్లను మూలన పడేసారని ధ్వజమెత్తారు. మూడు నెలల పాటు జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. తాడితోటలో ఏర్పాటు చేసిన కుట్టి మిషన్ సెంటర్‌లో 6,7,8, 10,11,12,13,14,15, 31 వార్డులకు, గోదావరి గట్టు సెంటర్‌లో 21,22,23,24,25,29,30 వార్డులకు, తుమ్మలావ సెంటర్‌లో 32,33,34,35,36,37,38,38,5 వార్డులకు, 47వ వార్డు కమ్యూనిటీహాలులో సెంటర్‌లో 40,41,42,43,44,45,46,47,48,49 వార్డులకు, నారాయణపురం సెంటర్‌లో 1,2,3,4,9,50 వార్డుల వారికి శిక్షణా తరగతులు నిర్వహిస్తారని వాసు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజావల్లి, టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాస్, యిన్నమూరి దీపు, రుంకాని విజయ్, శెట్టిజగదీష్, నల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం



గోకవరం బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

» తక్షణం నిలుపుదల చేయాలి
» సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగానికి చట్టాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్రె గుట్ట ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలుపుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాలు ధర్నా చేశాయి. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు పల్లా వెంకటనాయుడు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, సుప్రీంకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ, ఎం.దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ మాట్లాడారు. కార్పొరేట్లకు ఖనిజ సంపద కట్టబెట్టడానికి జరుగుతున్న ఆపరేషన్ ఇదని అన్నారు. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం అరెస్టు చేస్తే న్యాయస్థానాలు శిక్షిస్తాయి తప్ప ఆపరేషన్ పేరుతో భారత పౌరులను చంపరాదని అన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. అమాయకులను చంపడంలో ఉగ్రవాదులకు, మోదీ ప్రభుత్వానికి పెద్దతేడా లేదన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. మవోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనాల లాజరు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఏసుకుమార్, రాఘవులు, పవన్, ఏఐకేఎంఎస్ నాయకులు సత్తిబాబు, పి.సోమన్న, పాపన్న, ఎం.రాజు, ఈమని మల్లిక, గెడ్డం రవీంద్రబాబు, పాల్గొన్నారు.

అమరావతి తరలిన నాయకులు

కడియం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరుగుతున్న రాజధాని అమరావతి పునః ప్రారంభోత్సవ సభకు కూటమి నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం మండలంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు కడియం చేరుకున్నారు. కార్లు తదితర వాహనాల్లో అమరావతి వెళ్లారు. ఈ సందర్భంగా ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. వాహనాలను టీడీపీ నాయకుడు వెలుగుబంటి నాని ప్రారంభించారు.

గ్రీస్‌లో ఉద్యోగావకాశాలు

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళీ

రాజమహేంద్రవం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు గ్రీస్ దేశంలో ఇన్సులేషన్ టెక్నీషియన్, పంబ్లింగ్, నిర్మాణ రంగాల్లో ఉద్యోగాల కోసం అర్హులు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మురళీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు కోసం హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/ప్రోగ్రాం రిజిస్ట్రేషన్‌లో వివరాలు పొందుపర్చాలని సూచించారు. మరింత సమాచారం కోసం 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నెంబర్లను కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ధవళేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలు, క్షణికావేశంలో వివాహిత గోదావరిలో పడి మృతి చెందింది. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాటన్ పేటలో భర్త లక్ష్మీనారాయణ ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న అత్తిలి మౌనిక (29)గురువారం రాత్రి భర్తతో స్వల్ప వాగ్వాదం జరగడం, ఆపై అనారోగ్య కారణాల వల్ల మనస్తాపంతో అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి రామపాదాల రేవు వద్ద మునిగి మృతి చెందింది. భార్య కనిపించకపోవడంతో లక్ష్మీనారాయణ చుట్టు పక్కల వెతికి పోలీసులను ఆశ్రయించాడు. శుక్రవారం ఉదయం రామపాదాల రేవు వద్ద మౌనిక మృతదేహం ఉందన్న సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం బొగ్గుల దిబ్బలోని ఒక ఇంట్లో పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.51,300 నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కావాలి

కడియం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనులు, శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కావాలని బీజేపీ రూరల్ కన్వీనర్ ఎ.శ్రీధర్ అన్నారు. అమరావతికి కూటమి నాయకులతో వెళ్లారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు శుక్రవారం ప్రధాని అమరావతి రావడం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో బొర్సు సుబ్రహ్మణ్యం, సి.నాగేశ్వరరావు, డి. ముత్యం, తాతబ్బాయి, ఉండమట్ల ప్రభాకర్ తదితరులున్నారు.

ఉచిత వేసవి క్రీడ శిక్షణా శిబిరం ప్రారంభం

ఈ నెల 15 వరకు నిర్వహణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో మే 15వ తేదీ వరకూ ఈ శిక్షణా శిబిరం జరగనుంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, బాక్సింగ్‌కు సంబంధించి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శేషగిరిరావు, ప్రముఖ క్రీడా పరిశోధకులు సుంకర నాగేంద్ర కిషోర్, రిటైర్డు ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, కోచ్‌లు, క్రీడాకారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా ధర్మరాజు

ధవళేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ధవళేశ్వరం యూనిట్ ఏకగ్రీవంగా ఎన్నికైయింది. అధ్యక్షుడిగా యర్రమోతు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శిగా దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారిగా పుర్లింకల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, కె.రామారావు,కె. సూర్యనారాయణ, బుగ్గ సత్యసుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.సాయిబాబా, డి.కేశవరావు, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎన్.విజయమోహన్, సంయుక్త కార్యదర్శిగా ఎ.సూర్యారావు, కె.వెంకటరత్నం, సీహెచ్ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎ.సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ వారికి సంతాపంగా మౌనం పాటించారు.

ఉపాధ్యాయ ఉద్యమం బలోపేతానికి దాచూరి రాంరెడ్డి కృషి

రాజమహేంద్రవరం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని బలోపేతం చేసి తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు బాసటగా నిలిచిన దాచూరి రాంరెడ్డి సేవలు అమూల్యమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోంలో యూటీఎఫ్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన దాచూరి 9వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, జిల్లా సంఘం ఉపాధ్యక్షులు కె.విజయగౌరీ, కార్యదర్శులు రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, సీహెచ్ దయానిధి, వర్మ, ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

రంగంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో చేపట్టిన పనులకు, కొత్తగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సాయిబాబు తదితరులు కోరారు.



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కళాశాల చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

ఐఎస్‌టీఎస్‌కు ఉత్తమ మహిళా ఇంజనీరింగ్ కళాశాల అవార్డు

రాజానగరం, మే 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ (అటానమస్) కళాశాలకు ఆసియా టుడే మీడియా ప్రతిష్టాత్మకమైన ది బెస్ట్ ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్-2025 అవార్డు లభించింది. ఆసియా టు డే మీడియా వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్-2025 సందర్భంగా న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యా నాయకులు, విధాన నిర్దేతలు, పరిశ్రమ నిపుణుల సమావేశంలో ప్రదానం చేసిన ఈ అవార్డును కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉత్తమమైన విద్య, అత్యధిక ప్లేస్‌మెంట్స్, రీసెర్చ్, డెవలప్‌మెంట్‌కు దీన్ని అందుకున్నామన్నారు. దీనికి కృషి చేసిన వైస్ చైర్‌పర్సన్ వి.అనుషారెడ్డి, ప్రిన్సిపాల్ వై. రాజశ్రీరావు, ఏవో, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

ప్రధాని సభకు భారీగా తరలిన జనం



బిక్కవోలు నుంచి ప్రధాని సభకు వెళుతున్న మహిళలు

బిక్కవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు నుంచి అమరావతిలో జరిగే ప్రధాని మోదీ సభకు ఆయా ప్రాంతాల నుంచి భారీగా తరలి వెళ్లారు. మండలం నుంచి మూడు బస్సుల్లో రైతులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారని బిక్కవోలు ఎంపీడీఓ వి.శ్రీనివాస్ తెలిపారు. వీరికి టిఫిన్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామన్నారు. బస్సుకు ముగ్గురు ఉద్యోగులను ఎస్కార్టుగా పంపామన్నారు. ఈయన వెంట పరిపాలనాధికారి కుమార్, ఏపీఎం సుప్రియ, మంగరాజు తదితరులున్నారు.

సీతానగరం, (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వస్తున్న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయడానికి సీతానగరం నుంచి 3 బస్సులలో ప్రజలు తరలి వెళ్లారు. వీరిని ఎంపీడీవో భారతి, డిప్యూటీ తహసీల్దార్ సునీత, బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకట లక్ష్మి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంగంపేట,(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా వస్తున్న ప్రధాని మోదీ సభకు మూడు బస్సుల్లో కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు తరలివెళ్లినట్టు మండల ఎంపీడీవో సాయిబాబు తెలిపారు. వీరి బస్సులకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవిందు, బీజేపీ మండల అధ్యక్షుడు షైలవరపు సాయిరాం, జనసేన మండల అధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, కూటమి నాయకులు శుక్రవారం ఉదయం వడిశలేరు ఏడీబీ రోడ్డు వద్ద జెండాను ఊపి బస్సులను పంపించారు.



సీతానగరంలో ప్రధాని సభకు వెళుతున్న వారికి ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనపర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణకు ఆదిశంకరాచార్యులు చేసిన ప్రబోధాలు నేటికీ ఆచరణలో ఉన్నాయని వక్తలన్నారు. సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆర్.సురేష్‌శర్మ అన్నారు. శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా బాల రాజేశ్వరి పీఠంలో జయంతి వేడుకలు జరిగాయి. ఆయన ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన బీహెచ్‌ఎల్ నారాయణరావు, విజయలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రెడ్డి రామ్మోహనరావు, సర్వలక్ష్మి దంపతులు, రెడ్డి సతీష్, నాగదేవర బాలాజీశర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమస్యలపై అవగాహన

దివాన్‌చెరువు, మే 2 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ దివాన్ చెరువు సెక్టారు సూపర్‌వైజరు ఎన్.భూదేవి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు జూన్ 10వ తేదీ వరకూ ప్రతి శుక్ర, మంగళ వారాల్లో ఒక్కొక్క అంశంపై బాలికలకు అవగాహన కల్పిస్తారన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో తొలిరోజైన శుక్రవారం బాలికల సమష్టి పరిచయం, గ్రూపులుగా ఏర్పడడం, లక్ష్యాలు నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేటి యువ నటులకు అక్కినేని ఆదర్శప్రాయుడు



దొడ్డిగుంటలో అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రంగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): దివంగత అక్కినేని నాగేశ్వరరావు నేటి యువ నటులకు ఆదర్శ ప్రాయుడని అక్కినేని కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడబాల మరిడియ్యకాపు అన్నారు. పాతదొడ్డిగుంట గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అక్కినేని నటించిన జైజవాన్ చలనచిత్రం 55వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రైతు సంఘ నాయకుడు తోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అభిమానులు వెలమర్తి రామకృష్ణ, త్రిమూర్తులు, పేపకాయల వెంకన్న, నర్ల లక్ష్మీనారాయణ, కొండేపూడి పెదవెంకన్న, పంట సత్యనారాయణ, తోటకూర త్రిమూర్తులు, వల్లు ధర్మరాజు, చొల్లంగి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అభిమానులను మరిడియ్యకాపు సాలువా కప్పి, అక్కినేని జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, మే 2(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో తోటీగా పనిచేస్తున్న బంగారు భవానీకుమార్ గత నెల 27న డ్యూటీ నుంచి వెళ్తా మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో భార్యతో గొడవపడి, ఇంటి నుంచి వెళ్లిపోయి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు భార్య దుర్గాభవాని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

మోటారుసైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కేసు నమోదు

కొవ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్పీడ్ హైవేపై రోడ్డు మమ్మతులు కారణంగా రోడ్డును తవ్వి వదిలివేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కోరుమిల్లి రాజు(40) పంగిడి వైపు నుంచి కొవ్వూరు వైపు మోటారుసైకిల్‌పై వస్తున్నాడు. పట్టణ శివారు ఏషియన్ పె యింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై శుక్రవారం రాత్రి మోటారు సైకిల్ రోడ్డు తవ్విన గోతులలో అదుపు తప్పడంతో రాజు కిందపడిపోయాడు. ఈ ఘటనలో తల కు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి సంబం ధించిన వివరాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



▸ మూడు జిల్లాలు, ఏజెన్సీ రాకపోకలకూ అనుకూలం
▸ ప్రజాప్రతినిధులకూ సౌలభ్యం ▸ పిల్లలకు దగ్గరలోనే ఐటీ ఉద్యోగాలు
▸ వైసీపీ హయాంలో ధ్వంసం ▸ కూటమి రాకతో పునరుజ్జీవం
▸ నూతనోత్తేజంతో రాజధాని పనుల పునః నిర్మాణం శుభారంభం
▸ ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి భారీగా తరలివెళ్లిన జనం

గోదావరి టు అమరావతి!

ప్రధానితో..



అమరావతి సభకు వస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు







(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విజన్ ఉన్న నాయకుడి అభివృద్ధి.. విధ్వంస నాయకుడి ధ్వంసం మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలు గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా అనుభవించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రజలకు రాజధాని లేకుండాపోయింది. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని పదేపదే చెప్పడమే కాకుండా ఆచరణలో కూడా చేసి చూపించే సీఎం చంద్రబాబు.. రాజధానిని చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్మించాలని సంకల్పించారు. అన్ని పార్టీల అంగీకారంతో గుంటూరు- విజయవాడ ప్రాంతంలో నిర్మించాలనుకున్న రాజధానికి 'అమరావతి' అని నామకరణం చేశారు. 2017 మార్చి 2న శాసనసభను ప్రారంభించడంతో పాలన కూడా మొదలైంది. తర్వాత 2019లో ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా టీడీపీ అధికారం కొనసాగేవిధంగా ప్రజలు దీవించి ఉంటే ఈనాటికి అద్భుతమైన రాజధాని అమరావతి ఆవిష్కృతమయ్యేది. కానీ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. ప్రజలు జగన్‌కి పట్టంగట్టడంతో రాజకీయ కక్షను రాష్ట్ర ప్రయోజనాలకు ముడిపెట్టి అమరావతిని ధ్వంసం చేశారు. అప్పటివరకూ జరిగిన అమరావతి నిర్మాణాలను నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులంటూ ఐదేళ్లు మూడు ముక్కలాటగా నడిచింది. అయితే 2024లో మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో ఏర్పడిన కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం పగ్గాలు చేపట్టడంతో అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ప్రధాని మోదీతో రాజధాని పనులకు శుక్రవారం పునఃప్రారంభం చేయించారు. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి వాసులకు అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అమరావతి రాజధానికి వెళ్లాలంటే సగానికి సగం వ్యయ ప్రయాసలు తగ్గినట్టే.

● అందిపుచ్చుకున్నట్టేగా..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలతోపాటు రంపచోడవరం ఏజెన్సీవాసులకు కూడా అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. వివిధ పనులపై రాజధానికి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది తప్పుతుంది. హైదరాబాద్‌తో పోలిస్తే అమరావతి ఉమ్మడి తూర్పు వాళ్లకు దగ్గరే కాకుండా రవాణా సదుపాయమూ సౌలభ్యంగా ఉంటుంది. రైలు, బస్సుల్లో మూడు గంటల్లో, విమానంలో 45 నిమిషాల్లో అమరావతికి చేరుకోవచ్చు. కోర్టు, వైద్య పనులపై వెళ్లేవారికి ఇంకా సదుపాయంగా ఉంటుంది. రాత్రి వేళల్లో బస చేసే అవసరం ఉండదు. ఉదయం బయలుదేరితే పనులు చక్కబెట్టుకొని రాత్రి వేళకు ఇంటికి చేరుకోవచ్చు. గోదారోళ్ల రైలు ప్రయాణాలకు రాజమండ్రిని గేట్‌వేలాంటిది. ఈ రైల్వే స్టేషను గుండా విజయవాడ వెళ్లడానికి రోజూ 50కిపైగా రైళ్లు నడుస్తుంటాయి. అరగంటకో బస్సు అందుబాటులో ఉంటుంది. కాకినాడ జిల్లా వాళ్లకూ విజయవాడకు రవాణా సదుపాయాలు బాగానే ఉన్నాయి. కోనసీమ జిల్లావాసులకు రావులపాలెం నుంచి కూడా ప్రయాణ సదుపాయం మరింతగా కలుస్తుంది. అమలాపురం నుంచి మచిలీపట్నం హైవే గుండా కూడా విజయవాడకు సుమారు నాలుగు గంటల్లోపే చేరుకోవచ్చు.

● వైసీపీ హయాంలో ధ్వంస రచన

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతికి ధ్వంసరచన మొదలైంది. తాత్కాలిక హైకోర్టు మినహా పరిపాలన వంటి తాత్కాలిక భవనాలు తుది దశలో ఉండగా, రహదారులు వేగంగా నిర్మాణం జరుగుతూ.. ఐటీ కంపెనీలు కుదురుకునే దశలో సీఎంగా పగ్గాలు చేపట్టిన జగన్ అమరావతిని నట్టేట ముంచేశారు. జీఎన్‌ఆర్ కమిటీ సిఫారసులంటూ రాజధాని వికేంద్రీకరణను తెరపైకి తీసుకొచ్చారు. ఐదేళ్లపాటు మూడు ముక్కలాటను రాష్ట్ర ప్రజలకు చూపించారు. మూడు రాజధానులు కార్యరూపం దాలిస్తే ఉమ్మడి తూర్పు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారే. ఉదాహరణకు రాజమండ్రి నుంచి కర్నూలు 500 కిలోమీటర్లు, విశాఖపట్నం 200 కిలోమీటర్లు, విజయవాడ 200కిలోమీటర్ల దూరంలో త్రికోణాకారంలో ఉన్నాయి. విజయవాడకు ఉన్న సదుపాయాలు వేటికీ లేవు. దీంతో అష్టకష్టాలు పడాల్సి వచ్చేది.



అమరావతిలో ప్రధాని సభా ప్రాంగణంలో ఎంపీ హరీష్‌మాధుర్ , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

● పిల్లలకు దగ్గరలోనే ఉద్యోగాలు

ఓ పదేళ్ల నుంచీ సాఫ్ట్‌వేర్ చదువులపైనే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. కానీ తగిన అవకాశాలు మాత్రం దగ్గరలో లేవు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ కొలువులు కూడా దూరమయ్యాయి. మన దగ్గర చెప్పుకోదగిన కంపెనీలు లేవు. దీంతో 2019కి ముందు టీడీపీ అధికారంలో ఉండగా మొదలుపెట్టిన అమరావతి రాజధానిలో ఐటీ కంపెనీలకూ పెద్దపీట వేశారు. మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్ వంటి పెద్ద సంస్థల ఏర్పాటుకు చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని అటు విశాఖ, ఇటు అమరావతిలోను భారీ రాయితీలిచ్చారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిలోని నిర్మాణంలో ఉన్న ఐటీ కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయి. దీంతో ఐటీ కొలువుల కోసం యువత బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకే వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బెంగ తీరనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో మళ్లీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చేవిధంగా సీఎం చంద్రబాబు ఇప్పటికే కసరత్తు చేశారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలతోపాటు మధ్య, చిన్నతరహా ఐటీ కంపెనీలు పెద్దఎత్తున రానున్న కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. మన ఐటీ పిల్లలకు స్వల్ప దూరంలోనే ఉద్యోగ అవకాశాలూ లభించనున్నాయి.

● ప్రజాప్రతినిధులకూ అందుబాటులో..

ఉమ్మడి తూర్పుగోదావరిలో 23 నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్ రాజధానిగా ఉండే సమయంలో ఒక్కరోజు పనిపై అక్కడికి వెళ్లాల్సి వచ్చినా ప్రయాణకాలంతో కలిపి రెండు రోజుల సమయం పట్టేది. నియోజకవర్గంలో అకస్మాత్తుగా ఏదైనా ఘటన జరిగినా హాజరు కావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతానికి రావాలంటే కారులో సుమారు పది గంటలు పడుతుంది. రైలులో అయితే రాత్రి రైలెక్కితే ఉదయం హైదరాబాద్ చేరుకుంటారు. ఇప్పుడు ఉమ్మడి తూర్పునకు రాష్ట్ర రాజధాని 500 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల చేరువకు వచ్చేసింది. దీంతో ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు సైతం ముందు రోజు కాకుండా అదేరోజున ఉదయం బయలుదేరి వెళ్లి సాయంత్రానికి మళ్లీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే వెసులుబాటు కలిగింది. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సీఎం కార్యాలయం, రాష్ట్ర సచివాలయం, రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల కార్యాలయాల్లో పనులున్నా ఇలా బయలుదేరివెళ్లి.. అలా రాత్రికి వచ్చేయవచ్చు. దీంతో శ్రమ తగ్గడంతోపాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండే సమయం గణనీయంగా అదా అవుతోంది. అదే జగన్ చెప్పినట్లు మూడు రాజధానులైతే.. ఒక ఎమ్మెల్యే ఇక్కడి నుంచి బయలుదేరి అసెంబ్లీ సమావేశాలకు విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి అధికారులతో పనులకు విశాఖ చేరుకొని, కోర్టు పనులుంటే కర్నూలు వెళ్లి రావాలంటే ఎంత కష్టం.

మోదీ సభకు తరలివెళ్లిన జనం



ప్రధాని సభకు రంగంపేట మండలం వడిశలేరు నుంచి వెళుతున్న కూటమి శ్రేణులు

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని మోదీ సభకు శుక్రవారం జిల్లా నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు స్వీయ పర్యవేక్షణలో యంత్రాంగం 70 బస్సులను, కూటమి పార్టీల నాయకులు 250 బస్సులను ఉదయం ఏడు గంటల నుంచే గ్రామాలు, మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ప్రతి బస్సుకు ఒక ఉద్యోగిని సూపర్‌వైజర్‌గా నియమించడంతోపాటు వాటర్ బాటిళ్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచారు. బస్సులోని ప్రయాణికుల ఫోన్ నెంబర్లతో సహా పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. కొన్ని బస్సులకు ఒక టీం లీడర్‌ని ఏర్పాటు చేశారు. ముందుగా రూట్‌మ్యాప్‌పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కారం చూపడానికి కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటుచేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం గన్నవరం సిద్దార్థ మెడికల్ కళాశాలలో భోజనాలు, సభా ప్రాంగణంలో అల్పాహారం ఇచ్చారు. సాయంత్రం 6 గంటలకు తిరుగు ప్రయాణాలు ప్రారంభం కాగా దారిలోని గన్నవరంలో ప్రతి ప్రయాణికుడికి భోజన ప్యాకెట్లను అందజేశారు. మహిళా ప్రయాణికుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తంగా ప్రైవేటు వాహనాలతో కలిపి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రధాని మోదీ సభకు వేలాది మంది తరలివెళ్లడంతో కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు ఆనందం వ్యక్తంచేశారు.

2,38,767 టన్నుల ధాన్యం సేకరణ

కోతలకు అనుగుణంగా లక్ష్యాల పెంపు : జేసీ

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 206 రైతు సేవా కేంద్రాల ద్వారా 20వేల 692 మంది రైతుల నుంచి ఈ రబీ సీజన్లో 2,38,767 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. 31,349 ఎఫ్‌టీవోలకు 22,025కు చెందిన రైతుల ఖాతాల్లో రూ.400 కోట్ల 76 లక్షలు జమ చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో నూర్పిడిని అనుసరించి కొనుగోలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే లక్ష్యాలను పూర్తి చేశామని, అయితే ఆయా మండలాల్లో కోతల ప్రకారం కొనుగోళ్ల లక్ష్యాలను కూడా పెంచడం జరుగుతుందని వెల్లడించారు.

నిడదవోలు నియోజకవర్గ రహదారులకు మోక్షం

రూ.5 కోట్ల నిధులు విడుదల

రాజమహేంద్రవరం, మే 2(ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గంలోని రహదారులు యుద్ధప్రాతిపదికన బాగుపడతాయని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రహదారుల మరమ్మతులకు తన అభ్యర్థనతో రూ.5.10 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఎర్రచెరువు-పి.వేమవరం రూ.1.26 కోట్లు, వడ్లూరు-తీపర్రు రూ.3.24 కోట్లు, తేతలి-మునిపల్లి రహదారుల మరమ్మతులకు రూ.60 లక్షలు కేటాయించారని మంత్రి చెప్పారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సీఎం మత్స్య సంపద యోజన : జేసీ

రాజమహేంద్రవరం సిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వడం కోసం ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద లబ్ధిదారులను గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో సమన్వయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద పథకానికి సంబంధించి జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, జిల్లా కమిటీలో చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మెంబర్ సెక్రటరీగా జిల్లా మత్స్యశాఖ అధికారి, మెంబర్లుగా డ్వామా, డీఆర్‌డీఏ, భూగర్భ జలాలు, లీడ్‌బ్యాంక్ జిల్లా అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మత్స్యకారుల ఆదాయం పెంచడం, మత్స్య పరిశ్రమను అభివృద్ధిచేయడం, మత్స్య ఉత్పత్తిని పెంచడం కోసం సమర్థవంతమైన పనితీరు, కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారని జేసీ తెలిపారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ ఎస్.నిర్మలాకుమారి, మత్స్యశాఖ ఏడీ షేక్ దిల్‌సాద్, గ్రౌండ్‌వాటర్ డీడీ జి.రాధాకృష్ణ, డ్వామా పీడీ ఎం. నాగమల్లేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్.మూర్తి తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ రీఓపెన్‌లో 51 అర్జీలపై విచారణ చేసిన కలెక్టర్



కలెక్టరేట్‌లో శుక్రవారం నాడు పీజీఆర్ఎస్ రీఓపెన్‌లో భాగంగా విచారణ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కార మార్గంలో భాగంగా తిరిగి వచ్చిన వాటిపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి విచారణ నిర్వహించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో తన చాంబర్‌లో 51 అర్జీలపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అర్జీ పెట్టుకున్న ఫిర్యాదీదారు, అధికారి ఇద్దరి సమక్షంలో అర్జీల విషయమై విచారణ చేశామన్నారు. ఇందులో 37 అర్జీలు సహేతుకమైనవాటిగా గుర్తించామన్నారు. మరో 14 అర్జీలు వ్యక్తిగత ఒత్తిడి వ్యూహాలతో కూడినవి, తప్పుడు ఫిర్యాదులుగానూ గుర్తించామన్నారు. మండల స్థాయిలోను, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ పరిష్కారం అయ్యే అర్జీలను కేటగిరీల వారీగా నివేదిక రూపొందించినట్టు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మండలాల వారీగా రీఓపెన్ అయిన అర్జీల విషయంలో పరిష్కారం మార్గం కోసం సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. 20 అర్జీలను అర్జీదారులు, సంబంధిత అధికారి సమక్షంలో పరిష్కార స్థాయిపై చర్చించి పరిష్కారం అయ్యేవాటికి సంబంధించి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి అర్జీదారులైన గోపాలపురానికి చెందిన బి.సురేష్ నుంచి రెండు అర్జీలు, దేవరపల్లికి చెందిన కె.భరత్‌కుమార్, కోరుకొండకు చెందిన ఎం.శివరాం, టి.అంజలి, నిడదవోలుకు చెందిన ఎస్.దుర్గాదేవి, పెరవలికి చెందిన వో.నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం రూరల్‌కి చెందిన ఎం.సతీష్, రాజానగరానికి చెందిన సీహెచ్.సత్తిబాబు, సీతానగరానికి చెందిన సీహెచ్.సురేష్, బి.సూరిబాబు, డి.చిరంజీవి, తాళ్లపూడికి చెందిన ఆర్.సాయికృష్ణ నుంచి వివరాలు తెలుసుకుని వారి ఫిర్యాదులపై వాస్తవ పరిస్థితిని కలెక్టర్ వారికి వివరించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై పరిష్కారం చూపే విషయంలో కచ్చితత్వం చూస్తోందని తెలిపారు.

పితృదోషాల పేరుతో ఘరానా మోసం 8



కొవ్వూరులో గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో సేద తీరుతున్న ప్రజలు

అల్లాడి.. నదిలో ఆహ్లాద జడి..

కొవ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చి నిప్పులు కురిపిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత బాగా పెరిగింది. 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఎండకు తోడు వడగాలులు వీయడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. వేసవితాపం తాళలేక కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు గోష్పాద క్షేత్రానికి చేరుకుంటున్నారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తూ సేదతీరుతున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జలకాలాడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా సాయంత్రం అయ్యేసరికి గోష్పాదక్షేత్రానికి చేరుకోవడంతో క్షేత్రంలో సందడి నెలకొంటోంది. స్నానఘట్టాల్లో నదీ లోతు తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో దూర ప్రాంతాల యాత్రికులు, పర్యాటకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. యాత్రికుల సౌకర్యార్థం క్షేత్రంలో తగిన భద్రతతోపాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.





సువర్ణ గోదారి!

గోదావరిని ఎలా చూసినా మనోహరమే. ఒక్కోసారి ఒక్కో వర్ణంలో మెరుస్తూ మనల్ని మైమరిపిస్తుంది. శుక్రవారం సాయంసంధ్య సమయంలో మరొకమారు సమ్మోహనానికి గురిచేసింది. సాయంకాలంఅస్తమిస్తున్న తరుణంలో భానుడు బంగారు వర్ణపు కిరణాలను ప్రసరించాడు. ఆ వన్నెల కిరణాలకు గోదారీ స్వర్ణమయం అయిపోయింది. ఆ క్షణంలో ఎటుచూసినా స్వర్ణమయమే. ఇలా బంగారు వర్ణంలో గోదావరి తళతళలాడుతున్నప్పుడు అక్కడ ఇసుక తీస్తున్న యంత్రాలు గోదారిలోంచి బంగారాన్ని తీస్తున్నట్టుగా కనువిందైన దృశ్యాలను ఆవిష్కరించాయి..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు..



గౌరవ వందనం

కాకినాడ రూరల్ సూర్యారావు పేట ఎన్టీఆర్ బీచ్‌లో స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఏపీ ఆంధ్ర 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ- 2025 చాంపియన్‌షిప్ పోటీలను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎమ్మెల్యే పంతం నానాజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. **- సర్పవరం**

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

జగద్గురు శంకరాచార్యుల జయంతి


తిమ్మరాజుపాలెంలో శంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

నిడదవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): దేశం నలు మూలల పర్యటించి ధర్మ సంస్కృతి సంరక్షణ ధార్మిక చైతన్యం కోసం నాలుగు పీఠాలను స్థాపించిన జగద్గురు శంకరాచార్యులు నిత్య స్ఫూర్తి ప్రదాత అని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు శ్రీకాకోళపు పురుషోత్తం అన్నారు. శుక్రవారం నిడదవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలోని ఆదిశంకరాచార్యుల మండపంలోను, మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలోను ఆది శంకరాచార్యులు జయంతి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయార్చకులు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు, అప్పారావు శర్మ, పొన్నా కృష్ణబాబు, దేవులపల్లి రవిశంకర్, వేదుల జనార్ధనరావు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులోని గౌతమీనగర్‌లో శంకర మఠం వద్ద శంకర జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఏకవార రుద్రాభిషేకం, శ్రీశంకరాచార్యుల పూజ, శ్రీసీతారామ కల్యాణం తదితర పూజలు జరిపారు. మాండుకోపనిషద్భాష్య పాఠ ప్రవచనాలు అందజేశారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించండి

నిడదవోలు సంఘం అధ్యక్షుడు అప్పారావు


జిల్లా ట్రెజరీ అధికారి సత్యనారాయణను కలసిన నిడదవోలు ప్రతినిధులు

నిడదవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిడదవోలు పెన్షనర్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలగం అప్పారావు, కీర్తి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నిడదవోలు సబ్ ట్రెజరీ కార్యాలయానికి జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ రికార్డులు పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అయన దృష్టికి స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమస్యలు తీసుకువెళ్ళారు. యాప్‌ల ద్వారా కొంతమంది సభ్యులకు పే-స్లిప్‌లు డౌన్‌లోడ్ కావడం లేదని గుర్తించిన జిల్లా ట్రెజరీ అధికారి.. తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికార్లను ఆదేశించారు. పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో బొజ్జా పాపారావు, డి.గణేష్, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, సింహాద్రి, చంద్రబాబు, జి.హనుమంతరావు పాల్గొన్నారు.

వికసిత భారత్.. బీజేపీ సంకల్పం


కొవ్వూరు నుంచి రాజధాని అమరావతి పునఃప్రారంభ సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

- జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర
- రాజధాని అమరావతి పునఃప్రారంభ సభకు తరలిన కూటమి నాయకులు, కార్యకర్తలు
- బస్సులను ప్రారంభించిన పలువురు అధికారులు, నాయకులు


దేవరపల్లిలో బస్సులను ప్రారంభిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

కొవ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో వికసిత భారత్, రాష్ట్రంలో స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే బీజేపీ సంకల్పమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. శుక్రవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని ఆధ్వర్యంలో రెండు బస్సులను అమరావతి పంపించారు. అలాగే వాడపల్లి నుంచి ఎంపీపీ కాకర్ల నారాయుడు ఆధ్వర్యంలో ఒక బస్సును, దొమ్మేరు నుంచి మరో బస్సు అమరావతి వెళ్లినట్టు తహశీల్దార్ తెలిపారు. నాగేంద్ర మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీల కలయికలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం దేశంలోనే అత్యంత ఆధునికతతో ఏర్పాటుకానుందన్నారు. బీజేపీతోనే ఏపీ సంపూర్ణ అభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల కేంద్ర నిధులతో పనులు జరుగుతున్నాయని, మోదీ రాకతో మరో రూ.50 వేల కోట్లు రాజధానికి నిధులు కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో డేగల సునీత, గన్నమని విజయభాస్కర్, పెరుగు పోతురాజు, తురగ విజయభాస్కర్, కొప్పిరెడ్డి రాజబాబు, కోడూరి సతీష్, పవన్, మణికంఠ పాల్గొన్నారు.

చాగల్లు: ప్రజా రాజధాని అమరావతి 2.0 సభకు చాగల్లు నుంచి ఏర్పాటు చేసిన బస్సులను ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాజధాని మన అమరావతి అని ప్రజలు గర్వంగా చెప్పుకొనే విధంగా ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మాణం చేసే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని, అందుకు మనందరి సహకారం, మద్దతు కూటమి ప్రభుత్వానికి అవసరమన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, రైతులు, మహిళలు అమరావతి వెళ్లారు.


చాగల్లులో బస్సును ప్రారంభిస్తున్న నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి

పెరవలి: అమ రావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అతికాల వెంకట రామకృష్ణమ్మ, పిప్పర రవికుమార్, సలాది కృష్ణమూర్తి, ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

దేవరపల్లి: రాజధాని పునః ప్రారంభ సభకు మండలం నుంచి 4 బస్సులపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ, డ్వాక్రా మహిళలు వెళ్లారు. బస్సులను దేవరపల్లి బస్టాండ్ వద్ద తహశీల్దార్ ఎం.శ్రీని వాస్ ప్రారంభించారు. అమరావతి వెళ్లిన వారిలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ఉప్పులూరి రాంబాబు, డ్వాక్రా సమాఖ్య అధ్యక్షురాలు గద్దే రమాదేవి, వీఆర్వోలు తదితరులున్నారు.


పెరవలిలో బస్సును ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

వరి రైతుల్లో గుబులు

- అకాల వర్షంతో తడిచిన ధాన్యం
- రంగు మారుతుందని రైతాంగంలో ఆందోళన
- ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి తరలించాలని వేడుకోలు


తడిచిన ధాన్యాన్ని అరబెడుతున్న రైతులు


తడిచిన ధాన్యం

దేవరపల్లి, మే2(ఆంధ్రజ్యోతి): అకాల భారీ వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని త్యాజంపూడి, కృష్ణంపాలెం, దుద్దుకూరు, గౌరీపట్నం వరిరైతులు తమ ధాన్యాన్ని మిషన్ ద్వారా కోసి గుడ్డిగూడెం, కొవ్వూరు జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులో రాశులుగా పోసి అరబెట్టారు. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం వల్ల ధాన్యానికి బరకాలు కప్పి ఉంచినప్పటికీ కింద నుంచి నీరు చేరడంతో సగభాగం ధాన్యం తడిచింది. దీని వల్ల ధాన్యం రంగుమారే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి తరలించాలని రైతులు కోరుకుంటున్నారు. ధాన్యాన్ని అంతా రాశులుగా ఉండవలన వాతావరణ మార్పుల వలన ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతుల గుండెల్లో గుబులుపడుతుంది.

500 టన్నుల ధాన్యం కొనుగోలుకు మంత్రి దుర్గేష్ ఆదేశం

పెరవలి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన మంత్రి దుర్గేష్ 500 టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో పెరవలి, పిట్టల వేమవరం, కాపవరం, కానూరు అగ్రహారం తదితర గ్రామాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైస్‌మిల్లులకు తీసుకెళితే అక్కడ దింపుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వియత్నాం పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ మేరకు స్పందించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

- తక్షణం నిలుపుదల చేయాలి
- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ధర్నా


గోకవరం బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగానికి చట్టాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్రె గుట్ట ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలుపుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాలు ధర్నా చేశాయి. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు పల్లా వెంకటనాయుడు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, సుప్రీంకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ, ఎం.దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ మాట్లాడారు. కార్పొరేట్లకు ఖనిజ సంపద కట్టబెట్టడానికి జరుగుతున్న ఆపరేషన్ ఇదని అన్నారు. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం అరెస్టు చేస్తే న్యాయస్థానాలు శిక్షిస్తాయి తప్ప ఆపరేషన్ పేరుతో భారత పౌరులను చంపరాదని అన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. అమాయకులను చంపడంలో ఉగ్రవాదులకు, మోదీ ప్రభుత్వానికి పెద్దతేడా లేదన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. మవోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనాల లాజరు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఏసుకుమార్, రాఘవులు, పవన్, ఏఐకేఎంఎస్ నాయకులు సత్తిబాబు, పి.సోమన్న, పాపన్న, ఎం.రాజు, ఈమని మల్లిక, గెడ్డం రవీంద్రబాబు, పాల్గొన్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి
పలుచోట్ల అవగాహన సదస్సులు


నల్లజర్ల సదస్సులో పాల్గొన్నా కిషోర బాలికలు

నల్లజర్ల, మే 2(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో బాలికలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, హరతీ అన్నారు. శుక్రవారం మండలంలోని ఘంటావారిగూడెం, నల్లజర్ల, చీపురుగూడెం గ్రామాల్లో కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వచ్చినా, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే పోలీసు, ఐసీడీఎస్ వారికి తెలియజేయాలని కోరారు. బాలికలకు బ్యాడ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ప్రతి బాలిక బడిలో చదువు కోవాలని, గ్రామంలో ఉండే బాలికల వివరాలు, వారు చదువుతున్న బడి వివరాలు సేకరించాలని అంగన్‌వాడీ సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ రామాలక్ష్మి, శాంతి వల్లి, శివకుమారి, ప్రేమావతి, శ్రీదేవి, పద్మ, సౌజన్య, కనకదుర్గ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన, పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికా విద్యకు ప్రాధాన్యమివ్వా లని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పిల్లి మునసలయ్య, నిమ్మన కృష్ణమూర్తి, మోటుపల్లి సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడిపర్రులో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, మే 2(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో తోటీగా పనిచేస్తున్న బంగారు భవానీ కుమార్ గత నెల 27న డ్యూటీ నుంచి వెళ్తూ మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. రాత్రి 11గంటల సమయంలో భార్యతో గొడవపడి, ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు భార్య దుర్గాభవాని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే ముప్పిడికి సువర్ణరాజు పరామర్శ

దేవరపల్లి, మే2(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్య కారణంగా విజయవాడ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వచ్చిన ఆయన ఇంటి వద్ద శుక్రవారం గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు పరామర్శించారు. యోగక్షేమాల గురించి అడిగారు. పరామర్శించిన వారిలో జనసేన మండల అధ్యక్షుడు కట్నాం గణేశ్, జనసేన నాయకులు పుసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, మాధవరపు వెంకటేశ్వరరావు, బళ్లా రాము, పాపోలు ప్రదీప్, ఆకుల నాని, దాసరి శేషు, జాజిమొగ్గల శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, తదితరులు ఉన్నారు.

పితృదోషాల పేరుతో ఘరానా మోసం

- రెండో పెళ్లంటూ మ్యాట్రిమోనిలో అపరిచితుడి వల
- నమ్మబలికి రాజమహేంద్రవరం వచ్చిన నెల్లూరు మహిళ
- బంగారం, వెండి వస్తువులతో ఉడాయించిన అపరిచితుడు
- పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): పితృ దోషం పూజలు పేరులో ఒంటరి మహిళను గుర్తుతెలియని వ్యక్తి మోసం చేసి బంగారం, వెండి వస్తువులతో ఉడాయించాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు చెందిన జి.నాగభారతి అనే 30 ఏళ్ల మహిళ తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటుంది. రెండో వివాహం కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలో మేట్రిమోనిలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. అతడు.. నీకు నాకు కూడా పితృదోషాలు ఉన్నాయని రాజమహేంద్రవరం వస్తే కోటిలింగాల రేవులో పూజలు చేసి పరిహారం చెల్లిస్తే దోషాలు పోతాయని చెప్పడంతో ఆ గుర్తుతెలియని వ్యక్తి మాటలు నమ్మిన భారతి గత నెల 20న రాజమహేంద్రవరం వచ్చింది. దీంతో ఆమెను రిసీవ్ చేసుకున్న ఆ వ్యక్తి ఆమెను కోటిలింగాల రేవుకు తీసుకువెళ్లి పితృదోషాల పూజలు చేయించడానికి సిద్ధం చేసి ఆమెను ఒంటి మీద ఉన్న బంగారం, వెండి వస్తువులను తీసి స్నానం చేసి రమ్మని చెప్పాడు. దీంతో ఆమె వాటిని తీసి అతనికి ఇచ్చి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి వస్తువులతో సదరు వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీంతో ఆమె ఖంగుతిని పది రోజులుగా రాజమహేంద్రవరంలో ఆ వ్యక్తి కోసం వెతికి చివరికి శుక్రవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తి పేరు కూడా ఆమెకు తెలియదని, అతని ఫొటో ఉందని ఫిర్యాదులో పేర్కొంది. మొత్తం 34 గ్రాముల బంగారు ఆభరణాలు, 26 తులాల వెండి పట్టీలు అపహరించుకుపోయినట్టు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత క్రీడా శిక్షణ శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో మే 15వ తేదీ వరకూ ఈ శిబిరం జరగనుంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాక్సింగ్ క్రీడలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శేషగిరిరావు, ప్రముఖ క్రీడా పరిశోధకులు సుంకర నాగేంద్ర కిషోర్, కోచ్‌లు పాల్గొన్నారు.

గొల్లగూడెంలో వివాహిత ఆత్మహత్య


సుశీల(ఫైల్)

దేవరపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన దేవరపల్లి మండలం గొల్లగూడెంలో జరిగింది. గొల్లగూడెం గ్రామానికి చెందిన నూతంగి రామకృష్ణ, సుశీల (30) దంపతులకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. రామకృష్ణ కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రామకృష్ణ చెల్లెలు కొడుకు పుట్టినరోజు విషయంలో భార్యాభర్తలకు గొడవ జరగడంతో రామకృష్ణ తన కుమారుడిని తీసుకుని మేనల్లుడు పుట్టినరోజు కార్యక్రమానికి గురువారం ఉదయం వెళ్లాడు. రాత్రి ఎవరులేని సమయంలో సుశీల ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సుశీల మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

హైదరాబాద్ వెళ్లి పింఛను అందించిన వీఆర్వో


చాగల్లు నుంచి వెళ్లి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలికి పెన్షన్ అందజేస్తున్న వీఆర్‌వో శేషయ్య

చాగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): చాగల్లు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కొరారు జ్ఞాన స్రవంతి 2017లో ప్రమాదవశాత్తు రెండు కాళ్లు కోల్పోయింది. ఆమెకు దివ్యాంగురాలుగా నెలకు రూ.6 వేలు పింఛన్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. ఇదిలా ఉండగా స్రవంతి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు నెలలుగా పెన్షన్ తీసుకోలేదు. మే నెల మూడో నెల కావడంతో పెన్షన్ తీసుకోకపోతే పింఛను రద్దయ్యే ప్రమాదం ఉండడంతో స్థానిక వీఆర్‌వో జొన్నకూటి శేషయ్య శుక్రవారం హైదరాబాద్ వెళ్లి మూడు నెలల పెన్షన్ రూ.18 వేలును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా అతడిని తహశీల్దార్ ఎం.మెరికమ్మ సహా పలువురు అభినందించారు. దివ్యాంగురాలు తండ్రి శ్రీనివాసరావు వీఆర్‌వో శేషయ్యకు, కూటమి ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోటారుసైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి

కొవ్వూరు శివారు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ సమీపంలో ఘటన.. కేసు నమోదు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్పీడ్ హైవేపై రోడ్డు మమ్మతులు కారణంగా రోడ్డును తవ్వి వదిలివేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కోరుమిల్లి రాజు(40) పంగిడి వైపు నుంచి కొవ్వూరు వైపు మోటారుసైకిల్‌పై వస్తున్నాడు. పట్టణ శివారు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై శుక్రవారం రాత్రి మోటారుసైకిల్ రోడ్డు తవ్విన గోతులలో అదుపు తప్పడంతో రాజు కిందపడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భవిష్యత్ తరాల ఆశలకు అనుగుణంగా

అమరావతి నిర్మాణం

టీడీపీ నాయకుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మన రాజధాని మన అమరావతి ప్రజల రాజధానిగా నిర్మాణం చేయడంలో శుక్రవారం తొలి అడుగు పడిందని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గం నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో ఆయన విజన్‌కు అద్దం పట్టేలా ఆంధ్రుల కలల రాజధానిగా అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇది ఒక నగరం మాత్రమే కాక ప్రపంచ స్థాయి గుర్తింపు పొందే విధంగా నిర్మాణాలు జరుగుతాయని, భవిష్యత్‌లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రీస్ దేశంలో ఇన్సులేషన్ టెక్నీషియన్, పంబ్లింగ్, నిర్మాణ రంగాల్లో ఉద్యోగాల కోసం అర్హులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మురళీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు కోసం హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/ప్రోగ్రాం రిజిస్ట్రేషన్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.